క్లుప్తంగా

నిరుద్యోగ వేద విద్యార్థులకు భృతి

చీరాల అర్బన్: రాష్ట్రంలో వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వేద పండితులకు నిరుద్యోగ భృతిని చెల్లించేందుకుగాను దరఖాస్తులను ఈనెల 25వ తేదీ లోపు జిల్లా దేవదాయశాఖ అధికారికి సమర్పించాలని జిల్లా దేవదాయశాఖ అధికారి ఎం.పానకాలరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిరుద్యోగులుగా ఉన్న వేద పండితులకు నెలకు రూ.3 వేలు నిరుద్యోగ భృతిని చెల్లించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. వేద విద్యను అభ్యసించి నిరుద్యోగులుగా ఉన్న వారి వివరాలను అందించాలన్నారు.

చిన్న ఉద్యోగమని చులకన వద్దు



అద్దంకి: చిన్న ఉద్యోగమనే చులకన భావన వద్దన్నారు.. చిన్న ఉద్యోగం నుంచి పెద్ద ఉద్యోగలకు చేరుకోవచ్చని వక్తలు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం అద్దంకి గవర్నమెంట్ పాలిటెక్నిక్ కాలేజ్‌లో జాబ్ మేళా నిర్వహించారు. ఈ మేళాకు ప్రముఖ కంపెనీలు కల్లం టెక్స్టైల్స్, కేఎల్ గ్రూప్, మాస్టర్ మైండ్స్ కంపెనీ ప్రతినిధులు హాజరయ్యారు. ఈ జాబ్ మేళాకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ ఎస్కే సాహిల్ బాబు హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీ ప్రతినిధులు దూర ప్రాంతం నుంచి కళాశాలకు వచ్చి అభ్యర్థులను ఎంపిక చేసుకున్నందుకు వారికి కతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా ప్లేస్‌మెంట్ ఆఫీసర్ బీ శ్రీనివాస్, రాజ్‌కుమార్, రవి కిరణ్ కోఆర్డినేటర్లు గోపి, శ్రీకాంత్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

శివసేన ఎమ్మెల్యేపై ఫిర్యాదు



సీఐకు ఫిర్యాదు చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

మార్టూరు: పార్లమెంట్‌లో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన శివసేన ఎమ్మెల్యే సంజయ్ గైక్వాడ్ పై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు వారు శివసేన ఎమ్మెల్యేపై స్థానిక పోలీస్ స్టేషన్‌లో సీఐ ఎం శేషగిరి రావుకు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పేరం ప్రభాకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని, రాహుల్ గాంధీని ప్రజాస్వామ్య బద్ధంగా ఎదుర్కోలేని బీజేపీ, శివసేన పార్టీలు ఆయనను భౌతికంగా అంతమొందించేందుకు కుట్ర పన్నుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు షేక్ మొహమ్మద్ ఘనీ, షేక్ మౌలాలి, షేక్ నాగూర్, సనావుల్లా తదితర నాయకులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కేసు నమోదు చేస్తున్న తూనికల ఇన్‌స్పెక్టర్ నాగేశ్వరరావు

చీరాల టౌన్: ఎమ్మార్పీ (గరిష్ట చిల్లర ధర) కంటే అదనంగా వసూళ్లు చేసుకుంటూ అమ్మకాలు సాగించే వ్యాపారులపై చట్ట ప్రకారం చర్యలు తప్పవని తూనికలు, కొలతలు శాఖ చీరాల ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని ఈపురుపాలెం గ్రామ పంచాయతీలో వ్యాపార దుకాణాల వద్ద తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు చేశారు. గ్రామంలోని నాలుగు దుకాణాల్లో పామాయిల్ లీటర్ ప్యాకెట్ ఎమ్మార్పీ ధర రూ.108 ఉండగా అదనంగా రూ.125లకు అమ్మకాలు చేయడంతో అదనంగా అమ్మకాలు చేసే నలుగురు వ్యాపారులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ వస్తువులను ఎమ్మార్పీ ధరలకు విక్రయించడంతో పాటుగా తూకాల్లో తేడాలు లేకుండా చూసుకోవాలని, అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆయన వెంట సిబ్బంది ఉన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం

చీరాల రూరల్: ముఖ్యమంత్రి సహాయనిధికి చీరాల బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూ.30 వేలు విరాళాన్ని శుక్రవారం న్యాయవాదులు ఎమ్మెల్యే ఎంఎం. కొండయ్యకు అందించారు. ఈ సందర్భంగా న్యాయవాదులు బార్ అసోసియేషన్ హాలులో ఎమ్మెల్యేకు శాలువా కప్పి సన్మానించారు. న్యాయవాదులు తమ వంతు సహాయంగా వరద బాధితులకు సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు విరాళం అందించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు పాల్గొన్నారు.

రేపు సహజ సాహితీ పురస్కార ప్రదానం

చీరాల అర్బన్: సహజ సాహితీ, చీరాల వారి వార్షిక పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం స్థానిక రోటరీ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు సహజ సాహితీ నిర్వాహకులు బత్తుల బ్రహ్మారెడ్డి, వడలి రాధాకృష్ణ, మంత్రి కృష్ణమోహన్, పవని భానుచంద్రమూర్తిలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక, సాహితీ రంగాల్లో విశేష కృషి చేస్తున్న 10 మందికి పురస్కారాలు అందజేస్తారని తెలిపారు. కార్యక్రమానికి అందరూ హాజరుకావాలని వారు కోరారు.



టెక్స్‌టైల్ పార్కు శిలాఫలకం



చీరాల కుందేరులో పేరుకుపోయిన జమ్ము, తూటుకాడ



రామాపురం బీచ్‌కు వెళ్లే రోడ్డు



కొమ్మమూరు ప్రధాన కాలువ (ఫైల్)

ఇది మాటల ప్రభుత్వం..

- 100 రోజులు టీడీపీ పాలనలో అభివృద్ధి శూన్యం
- కొండయ్య హామీలు నెరవేరేది ఎప్పుడు.. ?
- చీరాలకు ఐటీ హబ్ చూడతరమా
- చేనేత టెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటయ్యేనా



చీరాల: రెండేళ్లపాటు చీరాల నియోజకవర్గంలో ప్రతీ గల్లీ తిరిగాను.. అనేక విధాలుగా నియోజకవర్గ భౌగోళిక పరిస్థితులు పరిశీలించాను. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా ఉంటూ రెక్కాడితే డొక్కాడని బడుగు, బలహీన వర్గాల కుటుంబ పరిస్థితులను దగ్గరుండి చూశాను. తాము అధికారంలోకి వస్తే చీరాలను ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎన్నికల సమయంలో ప్రస్తుత ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చీరాల నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన హామీలివే. వంద రోజుల పరిపాలనలో ఆయన ఇచ్చిన హామీలు ఒక్క అడుగు ముందుకు వేయలేదు. కనీసం ఆ హామీలకు దిశా నిర్దేశం లేకుండా పోయింది. ఆయన నిత్యం ప్రజల్లో ఉంటున్నప్పటికి నియోజకవర్గ అభివృద్ధిపై అధిష్టానం వద్ద తీసుకెళ్లే ప్రయత్నాల్లో వెనుకపడ్డారని చెప్పవచ్చు. చేనేత కార్మికులు అధికంగా ఉండే చీరాలలో టెక్స్‌టైల్ పార్కుకు ఎమ్మెల్యేతో పాటుగా సీఎం చంద్రబాబు బాగానే హామీలు గుప్పించారు. దివంగత సీఎం కొణిజేటి రోశయ్య హయాంలోనే చీరాలలో టెక్స్‌టైల్ పార్కు మంజూరైంది. తర్వాత కొన్ని మార్పులు, చేర్పుల అనంతరం టెక్స్‌టైల్ పార్కు కాస్తా హ్యాండ్లూమ్ పార్కుగా మారింది. నాయినిపల్లిలోని కొణిజేటి చేనేతపురి వద్ద 50 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఆ తర్వాత దానిని ఇతర అవసరాలకు 25 ఎకరాలు వినియోగించగా మరో 25 ఎకరాలు మాత్రమే మిగిలి ఉంది. ప్రస్తుతం ఈ ప్రాంతంలోనే టెక్స్‌టైల్ పార్కు కడుతామని హామీ ఇచ్చారు. చీరాలలో చేనేతలు అధికంగా ఉంటారు. గుంట మగ్గాలపైనే వస్త్రాలు నేస్తారు. మరమగ్గాల సంస్కృతి చీరాల్లో లేదు. దీన్నిబట్టి చూస్తే చీరాలకు టెక్స్‌టైల్ పార్కు అవసరం ఉండదు. కేవలం హ్యాండ్లూమ్ పార్కు సరిపోతుంది. చేనేత వస్త్రాలు తయారు చేసుకునేందుకు వీవింగ్ యూనిట్లు, రంగులు, రసాయనాలు వేసేందుకు డయ్యింగ్ యూనిట్లు, నూతన డిజైన్లు ఆవిష్కరించేందుకు కామన్ ఫెసిలిటీ సెంటర్లు, ఎగుమతులు, దిగుమతులకు హ్యాండ్లూమ్ ఎగ్జిబిషన్లు ఈ చేనేత పార్కులో ఏర్పాటు చేసుకునే అవకాశం ఉంటుంది. ఇవి జరిగితే చేనేతలకు చేనేత ఉత్పత్తి, ఎగుమతులు పెరిగి ఆర్థిక స్వావలంబన జరుగుతుంది. వంద రోజుల్లో ఈ ప్రాజెక్టు ఒక్క అడుగు ముందుకు వేయకపోవడం విశేషం.

కుంటుపడిన పర్యాటక రంగం..

అలానే చీరాలలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తామని దీని వలన బాపట్ల జిల్లా వ్యాప్తంగా నిరుద్యోగ యువకులు ఉద్యోగ అవకాశాలు, సాఫ్ట్‌వేర్ రంగం దూసుకెళ్తుందని సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే ఇచ్చిన హామీ అటకెక్కింది. అలానే వాడరేవు నుంచి రామాపురం వరకు పర్యాటకరంగంలో అభివృద్ధి చెందించి ప్రస్తుతం ఉన్న రోడ్డులో డబుల్ రోడ్డుగా విస్తరించి సౌకర్యాలు, వాటర్ బోటింగ్, ప్రభుత్వ రిసార్టులు, మినీ గోవాలో మాదిరి సౌకర్యాలు కల్పిస్తామని చెప్పిన హామీలు కనీసం కార్యరూపం దాల్చలేదు. కేవలం బీచ్‌లో డబుల్ రోడ్డు విస్తరణ పనులకు మాత్రమే శంఖుస్థాపన చేశారు. కనీసం తీరప్రాంతాలకు వచ్చే పర్యాటకులకు కనీస వసతులు కల్పించడం లేదు. చీరాల వాడరేవు, రామాపురం తీర ప్రాంతాలకు వేసవి సెలవులు, వారాంతపు సెలవులు, కార్తీకమాసంలో ఏపీతో పాటుగా తెలంగాణా, మహారాష్ట్ర ప్రాంతాలకు చెందిన అధికంగా పర్యాటకులు వస్తుంటారు. ఈ దశలో తీర ప్రాంతం అభివద్ధి, మినీ గోవా కార్యరూపం దాలుస్తుందా అని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఎమ్మెల్యే, సీఎం చంద్రబాబు చీరాల అభివృద్ధికి చేయూతనిస్తాడా ? లేదో ? అని ప్రజలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

- మంత్రి గారూ హామీలు నెరవేరేదెప్పుడు
- సీహెచ్‌సీ 100 పడకల వైద్యశాలగా మారేదెప్పుడు

అద్దంకి: ప్రస్తుత విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కి అద్దంకి చిరపరిచితమే. ఎక్కడే ఏ అభివృద్ధి పనులు చేయాలనే విషయం ఆయనకు తెలియంది కాదు. అయితే ఎన్నికల ప్రచార సమయంలో ఆయన ఇచ్చిన హామీలు ఎప్పుడు నెరవేరుస్తారని ప్రజలు ఎదురు చూస్తున్నారు. ముఖ్యంగా లోకేశ్ అద్దంకి వచ్చిన సమయంలో, తరువాత, ప్రచారం సమయంలో ఆయన అద్దంకిని మరింతగా అభివృద్ధి చేస్తానని, సీహెచ్‌సీని 100 పడకల వైద్యశాలకు మారుస్తామని చెప్పారు. అదే విధంగా కొరిశపాడు మండలంలోని యర్రం చిన్నపోలిరెడ్డి ఎత్తిపోతల, భవనాశి రిజర్వాయరు ప్రాజెక్టును పూర్తి చేయించి నీరు ఇస్తామని చెప్పారు. అద్దంకికి తొలిసారిగా మంత్రి హోదాలో వచ్చిన సమయంలో నామ్ రహదారిలో పెండింగ్‌లో ఉన్నపనులు పూర్తి చేయించి రైతులకు న్యాయం చేస్తామని చెప్పారు. కాని ఎక్కడా కూడా అవి కార్యరూపం దాల్చలేదు. కేవలం మాటలతోనే సరిపెట్టుకునేలా ఉందని స్థానిక ప్రజలు అభిప్రాయపడుతున్నారు.



అద్దంకి సీహెచ్‌సీ భవనం

పర్చూరు ఎమ్మెల్యే కనబడితే ఒట్టు..

- తన అనుచరులతో పాలన సాగిస్తున్నట్లు సమాచారం
- తుంగలో తొక్కిన హామీలు

చినగంజాం: వరుసగా మూడోసారి గెలిచిన పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు నియోజకవర్గంలో కనబడటం లేదని నాయకులు, కార్యకర్తలు గుసగుసలాడుకుంటున్నారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలో పలు హామీలు ఇచ్చారు. పర్చూరు మండలంలో గుంటూరు చానల్ పర్చూరు వరకు పొడిగింపు కార్యక్రమాన్ని చేపడతనన్నారు. యద్దనపూడి మండలంలో సాగర్ ఆయకట్టు దిగువ భూములకు నీరు అందించేందుకు కాలువ ఆధునికీకరణ పనులు చేపట్టేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఇంతవరకు వాటిపై అతీ లేదు గతీ లేదు. కారంచేడు మండలంలోని కారంచేడు గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కొమ్మమూరు కాలువ ఆధునికీకరణ పనులు చేపడతానన్నారు. మార్టూరు మండలంలో మార్టూరు అనుసంధానంగా ఉన్న గ్రావెల్ రోడ్డు 100 రోజుల్లో పూర్తి చేస్తానని హామీ ఇచ్చారు. కానీ పూర్తి చేయలేదు. అదే విధంగా ఎన్నికల పూర్తయిన తరువాత జూలై 4న 2024 వ్యవసాయ అనుబంధ శాఖల సమీక్ష సమావేశంలో ఏలూరి మాట్లాడుతూ పర్చూరులో మిర్చియార్డును రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటామని, రైతులకు ఆధునిక యంత్ర పరికరాలు అందిస్తామని హామీ ఇచ్చారు. నూతన మార్కెట్ యార్డుల నిర్మాణానికి స్థలాన్ని సేకరించి పర్చూరు, ఇంకొల్లు, కారంచేడు, చినగంజాం, వంకాయలపాడులో గోడౌన్ల నిర్మాణం చేస్తామని వాగ్దానాలు చేశారే తప్ప ఇప్పటి వరకు ఆ వైపు అడుగులు వేసిన దాఖలాలు కనిపించలేదు. అసలు ఉంటేనే కదా సమస్యలపై దృష్టి పెట్టడానికి అని ప్రజలు అనుకుంటున్నారు.

పాఠశాల నుంచే క్రీడలను ప్రోత్సహించాలి



కొణిదెనలో క్రీడలను ప్రారంభిస్తున్న పాఠశాల స్థల దాత



క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య



కబడ్డీలో పోటీపడుతున్న కొడవలివారిపాలెం, స్వర్ణ క్రీడాకారులు

చీరాల అర్బన్: క్రీడలను పాఠశాల స్థాయి నుంచే ప్రోత్సహిస్తే దేశానికి గర్వకారణమైన క్రీడాకారులు తయారవ్వడానికి అనుకూలంగా ఉంటుందని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య అన్నారు. శుక్రవారం చీరాల రూరల్ మండలం జాండ్రపేటలోని బీవీ అండ్ బీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో అండర్-14,17 బాలబాలికల ఆటల పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. పాఠశాల స్థాయి నుంచే చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించేలా విద్యార్థులను సన్నద్ధం చేయాలన్నారు. విద్యార్థులను క్రీడల వైపు ఆకర్షితులయ్యేలా చూడాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో పి.సుబ్రహ్మణ్యేశ్వరరావు, హెచ్‌ఎం పి.పూర్ణచంద్రరావు, స్కూల్ గేమ్స్ నియోజకవర్గ సమన్వయకర్త సీతాదేవి, కె.రాణి, పీడీ కె.శ్రీనివాసు పాల్గొన్నారు.

బల్లికురవ: మండలస్థాయిలో స్కూల్ గేమ్స్ పోటీలకు తమ పాఠశాల ఎంపిక కావటం అభినందనీయమని కొణిదెన యజ్ఞనారాయణ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల స్థల దాత కె. రాధాకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం స్కూల్ గేమ్స్‌ను లాంఛనం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈవో రమేష్‌బాబు, హెచ్‌ఎం కేబీ వెంకటేశ్వర్లు, పీఎంసీ చైర్మన్ డి. సాయికుమారి, కోఆర్డినేటర్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

కారంచేడు: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల మానసిక, శారీరక ఆరోగ్యం కోసం క్రీడలు చాలా ఉపయోగంగా ఉంటాయని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖాధికారి ఏ శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని కుంకలమర్రు ఆర్‌జేఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండలస్థాయి క్రీడా పోటీలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్‌ఎం పద్మావతి, పీఈటీలు సీహెచ్ సుబ్బారావు, పీ శ్రీనివాసులు, బీ రమాదేవి, కే ప్రసాద్ పాల్గొన్నారు.

మేదరమెట్ల ఉరుసు మహోత్సవం రేపు



సుందరంగా అలంకరించిన దర్గా

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామంలో హజరత్ కరిముల్లాషా ఖాదరీ కాలేషా పీర్ మస్తాన్ వలీ రహంతుల్లా అలైహి 41వ గంధ ఉరుసు మహోత్సవం ఆదివారం రాత్రి జరుగుతుందని నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రటనలో తెలిపారు. కావున భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఉరుసు మహోత్సవంలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు.

రహదారి పనుల అడ్డగింత



రహదారి పనులను అడ్డుకుంటున్న రైతులు

పర్చూరు(చినగంజాం): జాతీయ రహదారి పనులను రైతులు అడ్డుకున్నారు. శుక్రవారం పర్చూరు, ఉప్పుటూరు, నాగులపాలెం గ్రామాలకు చెందిన రైతులు వై జంక్షన్‌లో జరుగుతున్న 167-ఏ రహదారి పనులకు ఆటంకం కలిగించారు. తమకు సరైన నష్టపరిహారం చెల్లించకుండా రహదారి పనులు ఎలా చేపతారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం స్థానిక ఎమ్మెల్యే ద్వారా కలెక్టర్ దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. పర్చూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల విలువ రూ.12 లక్షల ఉండగా రూ.6 లక్షలు మాత్రమే నష్టపరిహారం చెల్లించినట్లు వారు వాపోయారు. ఈ విషయమై కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఆర్డీఓ, జాతీయ రహదారి అధికారులకు తెలియపరచినట్లు తెలిపారు. కార్యక్రమంలో తిమ్మరాజుపాలెం, పర్చూరు, నాగులపాలెం, బోడవాడ రైతులు, మాజీ ఆంధ్రప్రదేశ్ పొగాకు ఉత్పత్తి దారుల సహకార సంఘం డైరెక్టర్ కుక్కపల్లి బుచ్చిబాబు, మాజీ జెడ్పీటీసీ కొల్లా సుభాష్‌బాబు, మల్లాది హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.





మాజీ సీఎం జగన్‌ను కలిసిన హనిమిరెడ్డి

అద్దంకి రూరల్: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లి వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో అద్దంకి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. అదే విధంగా సంతమాగులూరు మండల జెడ్పీటీసీ అడవి శ్రీనివాస రావు నాయకుడు పూట్ల నాగేశ్వరరావులు కలిసి నియోజకవర్గ విషయాలు తెలియజేశారు.

ఏచూరి మరణం కష్ట జీవులకు తీరని లోటు

చీరాల టౌన్: పేద ప్రజల సంక్షేమం కోసం ఉపాధి హామీ పథకం చట్టాన్ని సాధించిన పేదవాడి గొంతుకైన సీతారాం ఏచూరి మరణం కష్టజీవులందరికి తీరనిలోటని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి అన్నారు. శుక్రవారం పట్టణంలోని డోలా ఐజాక్ ఎన్జీవో భవనంలో సీతారాం ఏచూరి సంతాప సభను ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు డి.వి జయ్‌భాస్కర్ అధ్యక్షతన నిర్వహించిన సభలో ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి ఐద్వా ప్రధాన కార్యదర్శి రమాదేవి హాజరై మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లోకి వచ్చి జవహర్‌లాల్ నెహ్రూ విశ్వ విద్యాలయంలో చదువుతూ ఎస్ఎఫ్ఐ నేతగా రాజకీయంగా మంచి పట్టు ఉన్న వ్యక్తి అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ, సీపీఎం నాయకులు బాబూరావు, కందయ్య, ఏడుకొండలు, భాగ్యరావు, కె.రామారావు, మస్తాన్‌రావు, సాదిక్, ఎస్ఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు.



ఏచూరి సంతాప సభలో మాట్లాడుతున్న ఐద్వా ప్రధాన కార్యదర్శి రమాదేవి

వృద్ధాశ్రమంలో దుప్పట్లు పంపిణీ

పర్చూరు (చినగంజాం): పర్చూరు నేతాజీ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం దుప్పట్లు పంపిణీ చేశారు. సిరిపురం గ్రామానికి చెందిన దాత వెలనాటి వెంకటరామ్ 32 మందికి దుప్పట్లు పంపిణీ చేసినట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ తెలిపారు. అనంతరం వృద్ధులందరికీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సభ్యులు నాగబైరు శ్రీనివాసరావు, కోట శ్రీనివాసరావు, పాబోలు వెంకన్న, గడ్డిపాటి శ్రీనివాసరావు,మున్నంగి వెంకట సుబ్బయ్య,పోలిశెట్టి చంద్రశేఖర్‌రావు, సత్యనారాయణ పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న రోటరీ సభ్యులు



మాట్లాడుతున్న ఎంపీడీవో సురేష్‌బాబు

ప్రభుత్వ పథకాలపై అవగాహన

మేదరమెట్ల: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామాల్లో 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కొరిశపాడు మండలం పీ.గుడిపాడు, బొడ్డువానిపాలెం గ్రామాల్లో కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఎంపీడీవో సురేష్ బాబు, ఎంపీపీ సాధినేని ప్రసన్నకుమారి, సీడీపీవో కృష్ణకుమారి, అంగన్‌వాడీ టీచర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాపై నిఘా



గుండ్లకమ్మ నదీ ప్రాంతాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో

అద్దంకి రూరల్: అక్రమంగా ఇసుక తరలింపులపై నిఘా పెట్టాలని చీరాల ఆర్డీవో సూర్య నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం అద్దంకిలోని గుండ్లకమ్మ నదీ ప్రాంతంలో ఇసుక తవ్వకాల ప్రదేశాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ పట్టణంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక తరలించే ట్రాక్టర్ యజమానుల ఫోన్ నంబర్లను సేకరించాలన్నారు. రాత్రి సమయాల్లో తరలించే అక్రమ ఇసుక రవాణాపై పోలీసు వ్యవస్థ, రెవెన్యూ సిబ్బంది అదుపుచేయాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ, వీఆర్‌వోలు, సెక్రటరీలు పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై అవగాహన అవసరం

వేటపాలెం: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఓఆర్‌డబ్ల్యూ డీ దానమ్మ పేర్కొన్నారు. శుక్రవారం పందిళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చీరాల మహిళా మండలి ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. హాస్పిటల్‌కి వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రక్తమార్పిడి విషయంలో సూదులు, సిరంజిలు వాడడం విషయంలో ఆచితూచి అడుగు వేయాలని తెలిపారు. ఆడపిల్లలు మరింత జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని సూచించారు. కార్యక్రమంలో జ్యోతి హెచ్‌ఎం శేఖర్ రావు, చీరాల మహిళా మండలి ప్రతినిధులు గీత, సుకీర్తన, సంధ్య శిరీష, విజయ్ పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న మహిళా మండలి సభ్యులు

మొక్కలు పర్యావరణ స్నేహితులు



మొక్క నాటుతున్న సర్పంచ్ సుమతి, ఇతరులు

ఇంకొల్లు (చినగంజాం): మొక్కలు పర్యావరణానికి స్నేహితులని వక్తలు పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఇంకొల్లు మండలం ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ బండారు సుమతి ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి పీ శేషగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచి మొక్కలు నాటి వాటిని పోషణ చేసే కార్యక్రమాన్ని చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం తిరుపతిరెడ్డి, పాఠశాల సిబ్బంది పీ పావని, భవనం శివలీల, పెంట్యాల పావని, బండారు అనిల్‌కుమార్, అంబటి సురేష్ పాల్గొన్నారు.